సాక్షి
ప్రకాశం
గురువారం । 28 । మార్చి । 2024



విరివిగా రుణాలు

వ్యవసాయ, అనుబంధ రంగాలతో పాటు ఇతర ప్రాధాన్య రంగాలకు విరివిగా రుణాలు అందించాలని కలెక్టర్ దినేష్ కుమార్ బ్యాంకర్లకు సూచించారు.

- 8లో..



యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన

ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చి పదిరోజులైనా సంబంధిత అధికారులు నిబంధనలు అమలు చేయడంలో విఫలమవుతున్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
34/25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి. పగలు ఉక్కపోతగా ఉంటుంది.


రంజాన్ వేళలు

గురువారం - ఇఫ్తార్ : సా॥ 6.27
శుక్రవారం - సహరీ : ఉ॥ 4.46



చంద్రబాబు జిత్తులమారి రాజకీయాలకు జనసేన, బీజేపీ నేతలకు భంగపాటు తప్పలేదు. పొత్తు పేరుతో ఓట్లు కొల్లగొట్టే ఎత్తు వేసి.. బరిలో ఆ పార్టీల ప్రాతినిధ్యం లేకుండా చేసి మరోసారి తన వెన్నుపోటు నైజాన్ని నిరూపించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రెండు పార్టీలకు ఒక్కటంటే ఒక్క సీటు కూడా కేటాయించలేదు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి (చిన్నమ్మ) సొంత ప్రాంతం కావడంతో ఒక్క సీటన్నా వస్తుందని భావించిన కమలనాథులకు నిరాశేమిగిలింది. జనసేనల పరిస్థితి కూడా అంతే. ఆ రెండు పార్టీ నేతలు, కార్యకర్తల్లో నైరాశ్యం నెలకొంది.

పోటే.. నైజం..!



- బీజేపీ, జనసేనకు భంగపాటు
- అన్ని సీట్లు సైకిల్‌కే
- చిన్నమ్మ ఇలాకాలో కమలనాథుల విలాపం
- జనసేన కేడర్ పరిస్థితి అంతే
- ఆమంచి విమర్శలపై కిమ్మనని టీడీపీ నేతలు
- తన నిజనైజాన్ని మరో సారి నిరూపించుకున్న చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఉమ్మడి జిల్లాలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్టీల మధ్య పొత్తు పేరుతో చంద్రబాబు వెన్నుపోటు రాజకీయానికి తెర తీశారు. మూడు పార్టీల ప్రాతినిధ్యం ఉంటుందని చివరి వరకు నమ్మించి.. చివరకు ఏకపక్షంగా అన్ని సీట్లు టీడీపీకే కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 12 స్థానాల్లోనూ టీడీపీ మాత్రమే పోటీ చేస్తోంది. జనసేన, బీజేపీ కార్యకర్తలు జెండాలు మోయడానికి మాత్రమే పరిమితం కావాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎంత చొక్కాలు చించుకున్నా ఒరిగేదేమీ లేదు కదా అని ఆ పార్టీల కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ప్రచారంలో జనసేన, బీజేపీ నాయకులు కానీ, కార్యకర్తలు కానీ పెద్దగా కనిపించడంలేదు. టీడీపీ నాయకులే జనసేన, బీజేపీ జెండాలను తమ కార్యకర్తల చేత పట్టించి డూప్ షో చేస్తున్నారన్న విమర్శలున్నాయి.

నమ్మకంగా తడిగుడ్డతో గొంతు కోశారు

జనసేన పరిస్థితి ఘోరంగా తయారైంది. అంతన్నారు.. ఇంతన్నారు.. చివరికొచ్చే సరికి రిక్తహస్తం చూపెట్టారని ఆ పార్టీ నాయకులు బహిరంగానే కామెంట్స్ చేస్తున్నారు. పవన్ కళ్యాణ్‌కు నమ్మకమైన మనిషిగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్‌కు పేరుంది. ఆయనకు ఒంగోలు సీటు ఇస్తానని పవన్ హామీ ఇచ్చారు. పొత్తు కుదిరినా ఒంగోలు సీటు మాత్రం జనసేనకే అని నమ్మకంగా చెప్పారు. తీరా పొత్తు కుదిరిన తరువాత టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్‌కు కట్టబెట్టారు. ఇదేం అని అడిగితే నీకు న్యాయం చేస్తామంటూ బుజ్జగిస్తున్నారు. ఇక గిద్దలూరు సంగతి కూటమిలో కలకలం సృష్టిస్తోంది. ఇటీవల కంభం, ఒంగోలులో జరిగిన సభల్లో ఆమంచి స్వాములు తెలుగుదేశం పార్టీ మిత్ర ధర్మం పాటించకుండా కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు. గిద్దలూరు సీటు ఇస్తామని పవన్ కళ్యాణ్‌తో పాటుగా రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ కూడా తనకు హామీ ఇచ్చినప్పటికీ తనకు సీటు దక్కకుండా కొందరు టీడీపీ నాయకులు మోసం చేశారని బాహాటంగానే విమర్శిస్తున్నారు. నేను పవన్ కళ్యాణ్ ప్రతినిధిని అని చెబుతూ ఆమంచి సంధిస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా తెలుగుదేశం పార్టీ మౌనం వహించడం పలు అనుమానాలకు తెరతీస్తోంది.

పురందేశ్వరి సొంత జిల్లాలో కమలానికి దక్కని చోటు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సొంత జిల్లా అయిన ఉమ్మడి ప్రకాశం జిల్లాలో బీజేపీకి ఒక్క సీటు కూడా దక్కలేదు. ఒంగోలు పార్లమెంట్ సీటును బీజేపీకి ఇస్తారని తొలుత ప్రచారం జరిగింది. ఇక్కడ నుంచి పోటీ చేసేందుకు టీడీపీకి అభ్యర్థి లేకపోవడంతో ఆ పార్టీ కూడా ఇందుకు ఓకే చెప్పినట్లు సమాచారం. పురంధేశ్వరి ఇక్కడ నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరగడంతో ఒంగోలు, మార్కాపురం అసెంబ్లీ స్థానాల నుంచి పోటీ చేయాలని బీజేపీ నాయకులు ఆశలు పెట్టుకున్నారు. అయితే ఆమె అనూహ్యంగా రాజమండ్రికి వెళ్లిపోవడమే కాకుండా సొంత జిల్లా గురించి ఆసక్తి చూపకపోవడంతో కమలం కార్యకర్తలలో నైరాశ్యం నింపింది. కనీసం ఒక్కసీటు ఇచ్చినా పార్టీలో ఉత్సాహం నింపినట్లుండేదని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు చెప్పుకుంటున్నారు.

తెలుగు సీరియల్‌ను తలపిస్తున్న దర్శి సీటు:

దర్శి నియోజకవర్గంలో తెలుగు దేశం పార్టీకి సరైన నాయకుడు లేక ఇబ్బందులు పడుతోంది. దీంతో ఎన్నికల్లో పోటీకి రోజుకో కృష్ణుడు తెరపైకి వస్తున్నారు. ఇదిలా ఉండగా ఇక్కడ నుంచి జనసేన పోటీ చేయడం ఖాయమంటూ తొలి నుంచి ప్రచారం జరిగింది. గుంటూరు జిల్లా పత్తిపాడుకు చెందిన గరికపాటి వెంకట్‌ను వ్యూహాత్మకంగా జనసేనలో చేర్పించింది. ఆయన తనకే సీటు అని చెప్పుకుంటూ ప్రచారం చేసుకున్నారు. ఆ తరువాత వైఎస్సార్ కాంగ్రెస్ సీటు నిరాకరించడంతో టీడీపీలో చేరిన అద్దంకికి చెందిన బాచిన కృష్ణ చైతన్యను దర్శికి వెళ్లమని చెప్పారు. ఆయన నో అని చెప్పేయడంతో ఒంగోలుకు చెందిన గోరంట్ల రవికుమార్‌ను టీడీపీ ఇన్‌చార్జిగా నియమించారు. రవికుమార్ పేరు ప్రచారంలో ఉండగానే నరసరావుపేటకు చెందిన కడియాల లక్ష్మి పేరును పరిశీలిస్తున్నట్లు ప్రచారం చేశారు. ఆమె కూడా ఆసక్తి చూపకపోవడంతో దామచర్ల సత్య పేరు ఖరారు చేస్తున్నట్లు వార్తలొచ్చాయి. విశాఖలో పట్టుబడిన డ్రగ్స్ వ్యవహారంలో దామచర్ల సత్య పేరు రావడంతో తేలు కుట్టిన దొంగల్లా ఉలిక్కిపడ్డారు. రోజులు గడుస్తున్నప్పటికీ దర్శి సీటు పీటముడి వీడడం లేదు.

ప్రచారంలో కనిపించని జనసేన, బీజేపీ నాయకులు

పొత్తు ప్రక్రియ పూర్తయి అభ్యర్థులను కూడా ప్రకటించినప్పటికీ మూడు పార్టీ నాయకుల్లోలలో ఉత్సాహం కనిపించడం లేదు. పేరుకు పొత్తే కానీ పోటీ మాత్రం టీడీపీ చేస్తుండడంతో జనసేన నాయకులు కానీ, బీజేపీ కేడర్ కానీ ప్రచారంలో ఎక్కడా కనిపించడం లేదు. ప్రధాన మంత్రి మోదీ సభలో సైతం పచ్చ జెండాలే కానీ బీజేపీ, జనసేన జెండాలు పెద్దగా కనిపించలేదు. జనసేనతో మొక్కుబడిగా రెండు సార్లు సమావేశాలు నిర్వహించిన టీడీపీ బీజేపీతో అంటీ ముట్టనట్లుగా ఉండడం పట్ల కమలంలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆక్వా కల్చర్ రంగంతో ఎంతో మందికి ఉపాధి

- ఏకేయూ వీసీ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి



సెమినార్‌కు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి

ఒంగోలు: ఆక్వా కల్చర్ రంగం నేడు ఎంతోమందికి ఉపాధి కల్పిస్తోందని ఏకేయూ వీసీ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి అన్నారు. స్థానిక ఏకేయూలో బుధవారం నిర్వహించిన జాతీయ సెమినార్‌కు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కోస్తా ప్రాంతంలోని తీర ప్రాంత గ్రామాల్లోని రైతులకు, వ్యవసాయ కూలీలకు, ఆక్వా కల్చర్ రంగంలో నిపుణులైన విద్యావంతులకు నేడు ఆక్వా కల్చర్ రంగం ఎంతగానో ఉపాధి కల్పిస్తోరన్నారు. ఈ రంగంలో పనిచేసేవారికి మేలు చేకూర్చేలా వస్తున్న మార్పుల గురించి తెలియజేసేందుకు ట్రెండ్స్ ఇన్ ఆక్వా కల్చర్ అండ్ రోల్ ఆఫ్ కెమికల్స్ ఇన్ ఆక్వా కల్చర్ మేనేజ్‌మెంట్ అనే అంశం మీద నిర్వహిస్తున్న ఈ సెమినార్ ఎంతోమందికి ఉపయోగకరంగా ఉండనుందన్నారు. ఆక్వాకల్చర్‌కు ప్రస్తుతం డిమాండ్ ఎక్కువగా ఉందని, దాని దృష్ట్యా యూనివర్సిటీలో కోర్సును ఏర్పాటు చేశామన్నారు. ఏకేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు మాట్లాడుతూ ఈ విద్యను అభ్యసించే విద్యార్థులు కూడా ఆక్వా కల్చర్ రంగంపై పూర్తి స్థాయిలో పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలన్నారు. చెన్నైకు చెందిన ఐసీఏఆర్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ ఎం.కైలాసం మాట్లాడుతూ ఉప్పునీటి ఫిన్ ఫిష్ సీడ్ ఉత్పత్తి, వాటి పెరుగుదలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కోర్సును అభ్యసించడం ద్వారా ఎంతోమంది విద్యార్థులు సైతం ఉద్యోగ అవకాశాలను పొందుతున్నారని ఏకేయూ కాలేజీ ప్రిన్సిపాల్ జి.రాజమోహన్ తెలిపారు. ఈ సెమినార్‌కు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం మెరైన్ సైన్స్ విభాగం సహాయ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ వెంకట రాయలు, విజయవాడకు చెందిన అవంతి ఆక్వా ఫీడ్స్ మేనేజర్ డాక్టర్ ఎన్.నరేంద్రబాబు, ఆక్వా ఇండియా కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ కె.రమేష్ తదితరులు ఆక్వా కల్చర్ సాగులో రసాయనాల వినియోగం గురించి వివరించారు. ఈ సెమినార్‌లో డాక్టర్ సురేష్, ఎస్.నిర్మలామణి, యూనివర్సిటీకి చెందిన అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

జిల్లా వైద్యశాల ఆర్‌ఎంఓగా రామచంద్రరావు

మార్కాపురం: మార్కాపురం జిల్లా వైద్యశాల ఆర్‌ఎంఓగా డాక్టర్ పీ రామచంద్రరావును నియమిస్తూ సూపరింటెండెంట్ డాక్టర్ పీ సావిత్రి ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ సూపరింటెండెంట్‌గా డాక్టర్ కే వీరాంజనేయ నాయక్, డాక్టర్ డీ శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఆర్‌ఎంఓగా డాక్టర్ ఎం రాంబాబు, ఆరోగ్య శ్రీ ప్రతినిధిగా డాక్టర్ జాన్ రిచర్డ్స్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఫారం 7,8లను పూర్తిగా పరిష్కరించాం

- సీఈఓకు తెలిపిన కలెక్టర్ దినేష్‌కుమార్



వీడియో సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఇతర అధికారులు

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితాకు సంబంధించిన ఫారం -7, 8లను పూర్తిగా పరిష్కరించామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సీఈఓ (రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి) ముఖేష్‌కుమార్ మీనాకు తెలిపారు. బుధవారం సీఈఓ జిల్లా కలెక్టర్లతో ఎన్నికల సంబంధిత అంశాలపై వీడియో సమావేశం నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, డీఆర్‌ఓ శ్రీలత, అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా అంశాలను కలెక్టర్ సీఈఓకు వివరించారు. జిల్లాలో ఓటర్లను ప్రలోభపెట్టేలా తరలిస్తున్నట్లు అనుమానిత నగదు సుమారు రూ.45 లక్షలు, మద్యం ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం సీఈఓ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరిస్తున్న నివేదికలను ప్రతిరోజు సకాలంలో పంపాలన్నారు. అదేవిధంగా వల్నరబులిటీ మ్యాపింగ్ వివరాలను కూడా వెంటనే అందజేయాలన్నారు. దీనిలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

నాగులుప్పలపాడు: ఎన్నికల నియమావళి మేరకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ సూచించారు. మండల కేంద్రమైన నాగులుప్పలపాడులో 216 జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన వాహనాల తనిఖీ చెక్‌పోస్టును సంతనూతలపాడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. వాహనాల తనిఖీలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని, వీటితో పాటు వీడియో రికార్డింగ్ చేయాలన్నారు. ప్రజా ప్రతినిధుల వాహనాలకు ఎలాంటి మినహాయింపు లేదని, వారి వాహనాలను కూడా తప్పకుండా పరిశీలించాలన్నారు. రూ.50 వేలకు మించి ఎక్కువ నగదు ఆధారాలు లేకుండా తరలించరాదని స్పష్టం చేశారు. అనంతరం ఆర్వో గోపాలకృష్ణ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నగదు, అక్రమ మద్యం తరలింపును అడ్డుకునేందుకు వాహనాల తనిఖీ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారన్నారు. ప్రతి చెక్ పోస్టు వద్ద సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేసినట్లు, విధులు నిర్వహించేందుకు అధికారులు మూడు షిఫ్టుల్లో వేసి వారికి ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీచేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఇప్పటి వరకు జిల్లాలో వివిధ చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీల్లో రూ.40 లక్షల నగదు చూపనివి గుర్తించి సీజ్ చేసినట్లు చెప్పారు. చెక్‌పోస్టుల్లో పనిచేస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో మహాలక్ష్మి, రూరల్ సీఐ అజయ్‌కుమార్, ఎస్సై బ్రహ్మనాయుడు ఉన్నారు.

ఒకే జెండా.. సంక్షేమమే అజెండా



పైడిపాడు లో నాయకులు, కార్యకర్తలతో మంత్రి సురేష్

- మంత్రి ఆదిమూలపు సురేష్



పచ్చాకు కూలీలతో మమేకమై వారితో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

జరుగుమల్లి: ఒకే జెండా..సంక్షేమమే అజెండా.. మనమందరం ఒక్కటే.. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దాం అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి డా.ఆదిమూలపు సురేష్ అన్నారు. మండల పరిధిలోని చిరికూరపాడు, పైడిపాడు, రెడ్డిపాలెం, వర్ధినేనివారిపాలెం గ్రామాల్లోని వైఎస్ఆర్ సీపీ నాయకులతో ఆత్మీయ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి మేలు చేసిందని, ధైర్యంగా ఓటు అడిగే హక్కు మనకుందని అన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, ప్రతి పనిని ప్రజలకు గుర్తు చేయాలన్నారు. మనం అభివృద్ధి చేశామని, సంక్షేమం అమలు చేశామని వారు తప్పక ఆదరిస్తారని ధీమా వ్యక్తం చేశారు. నాయకుల మధ్య అభిప్రాయ భేదాలు లేవు..సమష్టిగా కృషి చేసి కొండపి నియోజకవర్గాన్ని గెలిచి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇద్దామని నాయకులకు తెలిపారు. ప్రభుత్వం కుల మతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధి కోసం అనేక సంక్షేమాలు అమలు చేశారన్నారు. గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, బల్క్ మిల్క్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నారన్నారు. కొండపి నియోజకవర్గంలో ఫ్యాన్ గుర్తు పై ఓటు వేయించి పార్లమెంటు అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థిగా నన్ను అత్యధిక మెజార్టీ తో గెలిపించాలని కోరారు. చిరికూరపాడులో సొసైటీ అధ్యక్షుడు చాగంటి ప్రసాద్, పాలడుగు జగదీష్, మాజీ జెడ్పీటీసీ జడా రిచర్డ్స్ మంత్రి సురేష్ ని శాలువాలు కప్పి వారి నివాసాల్లో ఘనంగా సన్మానించారు. చిరికూరపాడు గ్రామంలో పచ్చాకు కూలీలను ఆత్మీయంగా పలకరించి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకుడు పాటిబండ్ల నాగేశ్వరరావు, గాలి శ్రీనివాసరావు, పిన్నిక శ్రీనివాసరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బత్తిన మనోహర్, మండల జేసీఎస్ కన్వీనర్ తాటికొండ రామచంద్రరావు, జిల్లా ప్రచార విభాగం ఉపాధ్యక్షుడు కొమ్మాలపాటి మధు, జిల్లా ప్రచార విభాగం జాయింట్ సెక్రటరీ కొండూరి ప్రశాంత రెడ్డి, వైస్ ఎంపీపీ పులి బిక్షాలు, సర్పంచ్ నాగినేని భాస్కర చౌదరి, నవులూరి సురేంద్ర, దుంపా అనిల్ కుమార్ రెడ్డి, దగ్గుమాటి శంకరరెడ్డి, వాసా నారాయణ రెడ్డి, చాగంటి కొండయ్య పలువురు మండలంలోని నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మంత్రి మేరుగు నాగార్జునతో కలిసి సంఘీభావం తెలియజేస్తున్న బీసీ సంఘ నాయకులు

బీసీలు వైఎస్సార్‌సీపీకి వెన్నెముక

- నియోజకవర్గ స్థాయి బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు మంత్రి మేరుగు నాగార్జునకు సంఘీభావం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్లు బీసీ అంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదని, బ్యాక్‌బోన్ అని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వెన్నుముక అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. పేర్నమిట్టలోని ప్రైవేటు కల్యాణ మండపంలో బుధవారం బీసీ సంఘాల ఆత్మీయ సమావేశానికి మంత్రి మేరుగు నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల నుంచి హాజరైన బీసీ సంఘాల నాయకులు మంత్రి మేరుగు నాగార్జునకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను మూడోసారి ఎగురవేసేందుకు కలిసికట్టుగా పనిచేస్తామని మంత్రికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బీసీ నేతలనుద్దేశించి మంత్రి నాగార్జున మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ కృషి చేస్తోందని, వారికి అండగా ఉంటోందన్నారు. రానున్న ఎన్నికల్లో సంతనూతలపాడు ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలందరినీ అక్కున చేర్చుకొని ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులతో బీసీ సంఘాల నాయకులు కలిసి పనిచేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల నుంచి బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హుర్రే..పరీక్షలైపోయాయ్



ఆటవిడుపు కేరింత..

పదింతల ఆనందం

- ముగిసిన పదో తరగతి పరీక్షలు
- ఉత్సాహంగా ఇళ్లకు బయల్దేరిన విద్యార్థులు

ఒంగోలు: పదో తరగతి పరీక్షలు బుధవారం ముగిశాయి. దీంతో ఉత్సాహంగా విద్యార్థులు ఇళ్లకు బయల్దేరారు. హాస్టళ్లలో ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు తమ లగేజీలతో తల్లిదండ్రులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య ఇంటి ముఖం పట్టారు. బుధవారం జరిగిన సోషల్ పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 28,160 మంది హాజరుకావాల్సి ఉండగా 27,898 మంది హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులు 600 మంది హాజరుకావాల్సి ఉండగా 137 మంది మాత్రమే రాశారు. జిల్లా పరిశీలకులు 7 సెంటర్లను, డీఈవో 3 సెంటర్లను, ఫ్లయింగ్ స్క్వాడ్ 60 సెంటర్లను తనిఖీ చేశారు. పరీక్షలు పూర్తిగా ప్రశాంతంగా నిర్వహించినట్లు డీఈవో డి.సుభద్ర తెలిపారు.



సెల్ఫీ టైం



బై..బై కాలేజీలో కలుద్దాం..



ఇంటికొచ్చేస్తున్నా..



పరీక్షల బరువు దిగిందిగా..

క్లుప్తంగా

గుర్తుతెలియని వాహనం ఢీకొని దివ్యాంగుడు మృతి

గిద్దలూరు రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని దివ్యాంగుడు మృతి చెందిన సంఘటన మండలంలోని బురుజుపల్లె గ్రామ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. కొత్తకోట గ్రామానికి చెందిన పుల్లయ్య(49) అనే దివ్యాంగుడు ట్రై సైకిల్‌పై ఐసులు విక్రయించుకుని వెళ్తున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పుల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

గిద్దలూరు రూరల్: కుటుంబ కలహాల కారణంగా ఓ వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన పట్టణంలోని కొంగలవీడు రోడ్డులో బుధవారం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం మార్తా విజయలలిత(26) కుటుంబ కలహాల కారణంగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సంఘటనా స్థలాన్ని సీఐ వైవీ సోమయ్య పరిశీలించి వివరాలు సేకరించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతురాలి భర్త పాస్టర్‌గా పనిచేస్తుండగా, వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి?


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మార్కాపురం రూరల్: మార్కాపురం–తర్లుపాడు రోడ్డులో మిట్టమీదిపల్లి, బొడిచర్ల గ్రామాల నడుమ మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి గూడ్స్ రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి హరికృష్ణ బుధవారం తెలిపారు. మృతుడి వయసు సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుందని, తెల్ల చొక్కా ధరించి ఉన్నాడని రైల్వే పోలీసులు పేర్కొన్నారు. మృతుని సమాచారం తెలిసినవారు 77026 50514ను సంప్రదించాలని సూచించారు. కాగా ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది హత్యా.. లేక ఆత్మహత్యా..? అనేది పోలీసులు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

వ్యవసాయ, అనుబంధ రంగాలకు విరివిగా రుణాలు

- పొదుపు సంఘాల మహిళలు, పాడి రైతులకూ దన్నుగా నిలవాలి
- బ్యాంకర్లకు కలెక్టర్ దినేష్‌కుమార్ సూచన
- 2023–24 వార్షిక రుణ లక్ష్యం రూ.17,988 కోట్లు కాగా రూ.16,819 కోట్లు అందించినట్లు ఎల్‌డీఎం వెల్లడి


బ్యాంకర్లతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: వ్యవసాయ, అనుబంధ రంగాలతోపాటు ఇతర ప్రాధాన్య రంగాలకు లక్ష్యం మేర రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ బ్యాంకర్లకు సూచించారు. బుధవారం ఒంగోలులోని ప్రకాశం భవనంలో జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటీతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రుణాలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించి యూనిట్లు ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మూడో త్రైమాసికం ముగిసే వరకు రంగాల వారీగా రుణాలు మంజూరు చేసిన తీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, అనుబంధ రంగాలకు 105.69 శాతం రుణాలు మంజూరు చేసినట్లు ఎల్‌డీఎం అబ్దుల్ రహీం తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 10,511 మంది కొత్త రైతులకు రూ.232.72 కోట్ల రుణాలు పంపిణీ చేసినట్లు వివరించారు. డీఆర్‌డీఏ పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు లక్ష్యంలో 78.79 శాతం, మెప్మా పరిధిలో సంఘాల మహిళలకు 340.08 శాతం రుణాలు అందించినట్లు తెలిపారు. ఈ ఏడాది రూ.17,988 కోట్ల వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యంలో ఇప్పటి వరకు రూ.16,819 కోట్ల (93.5శాతం) రుణాలు మంజూరు చేశామని పేర్కొన్నారు. ప్రాధాన్యేతర రంగాల్లో 142.65 శాతం రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ.. గ్రామీణ ప్రాంతాల్లోని పొదుపు సంఘాల మహిళల జీవనోపాధి మరింత మెరుగుపడేలా రుణాలు మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. పీఎంఈజీపీ రుణాలను వేగంగా మంజూరు చేయాలని చెప్పారు. పాడిపరిశ్రమ ఆధారంగా జీవిస్తున్న కుటుంబాలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఆ దిశగా బ్యాంకర్లు, డీఆర్‌డీఏ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో పరిస్థితిని పరిగణలోకి తీసుకుని చేనేత, మైక్రోఫుడ్ ప్రాసెసింగ్, విద్యా రుణాల మంజూరును వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో పీడీసీసీబీ సీఈఓ కోటిరెడ్డి, జిల్లా పరిశ్రమల సంస్థ జీఎం శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, మెప్మా పీడీ రవికుమార్, జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ బేబిరాణి, మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ ధనలక్ష్మి, దివ్యాంగుల శాఖ ఏడీ అర్చన, చేనేత ఏడీ ఉదయ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వం పేదల పక్షం


గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కేపీ

ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

గిద్దలూరు రూరల్: జగనన్న ప్రభుత్వం పేదల పక్షంగా నిలిచిందని గిద్దలూరు సమన్వయకర్త, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. మండలంలోని గడికోట, దేవనగరం, సంజీవరాయుడుపేట, దంతెరపల్లె, అంకిరెడ్డిపల్లె, కొత్తకోట, బురుజుపల్లె, వెంకటాపురం, కె.ఎస్.పల్లె, దిగువమెట్ట గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన ఇంటింటా తిరిగారు. తొలుత ఆయా గ్రామ ప్రజలు నాగార్జునరెడ్డికి పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకం గురించి ప్రజలకు తెలియజేస్తూ ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుకు ఓటు వేసేలా చేయాలన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రతి కార్యకర్త, నాయకుడు ప్రజలతో మమేకం అవుతూ విస్తృత స్థాయిలో పనిచేద్దామన్నారు. గ్రామాల్లోని ప్రజల ఆదరణ, అభిమానాలు చూస్తుంటే చాలా ఆనందంగా ఉందన్నారు. మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి, మాజీ ఎంపీపీ పి.శ్రీనివాసు యాదవ్, మండల కన్వీనర్ పూలి రామకృష్ణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఓబులరావు, గడికోట సర్పంచి బంగారు శివ, వైస్ ఎంపీపీ నోవెల్, మాజీ సర్పంచి కలువ వెంకట సుబ్బయ్య, ఎంపీటీసీ పిడుగు శ్రీనివాస రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కృష్ణారెడ్డి, శివారెడ్డి, పగడాల వెంకటేశ్వర్లు, రంగారెడ్డి, రమణారెడ్డి, కలువ సుబ్బారావు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం తరలింపు


నిందితులు, సీజ్ చేసిన కారు, మద్యం చూపుతున్న సెబ్ అధికారులు

- ఇద్దరు నిందితులు అరెస్ట్, మరొకరు పరారీ
- కారు, 288 క్వార్టర్ల మద్యం సీజ్
- వివరాలు వెల్లడించిన సెబ్ డీఎస్పీ దుర్గాప్రసాద్‌రెడ్డి

కంభం: కారులో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని సీజ్ చేసి, ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సెబ్ డీఎస్పీ దుర్గాప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక సెబ్ కార్యాలయంలో మార్కాపురం సెబ్ డీఎస్పీ దుర్గాప్రసాద్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించి కేసు వివరాలు వెల్లడించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అర్ధవీడు మండలంలో తనిఖీలు నిర్వహిస్తుండగా పోతురాజుటూరు నుంచి యాచవరం వెళ్లే మార్గంలో కారులో మద్యం తీసుకెళ్తున్న ముగ్గురు వ్యక్తులను గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకునే ప్రయత్నంలో ఒక వ్యక్తి పరారయ్యాడు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని, 288 క్వార్టర్ సీసాల మద్యంతో సహా కారును కంభం సెబ్ కార్యాలయానికి తరలించారు. కాకర్లలోని ప్రభుత్వ మద్యం దుకాణం సూపర్ వైజర్ కొప్పుల వెంకట రమేష్, వాచ్‌మెన్ దార్ల అనిల్ ఎమ్మార్పీ కంటే రూ.10 అదనంగా తీసుకుని 288 క్వార్టర్ల మద్యం విక్రయించినట్లు విచారణలో తేలిందని సెబ్ డీఎస్పీ చెప్పారు. మద్యం సీసాలతో పాటు కారును, మొబైల్ ఫోన్లను సీజ్ చేసి ఇద్దరు నిందితులను గిద్దలూరు కోర్టులో హాజరుపరిచారు. సీజ్ చేసిన సొత్తు విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని తెలిపారు. పారిపోయిన యామా చిన్నవెంకటేశ్వర్లు కోసం గాలిస్తున్నామన్నారు. సెబ్ సీఐ ఎం.బాలకృష్ణ, సబ్ ఇన్‌స్పెక్టర్ వీఆర్ సత్యనారాయణ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

సంక్షేమ పాలనకు మళ్లీ పట్టం కట్టండి


ముసిలిపల్లిలో నవరత్నాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న దద్దాల నారాయణయాదవ్

వెలిగండ్ల: సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే మళ్లీ పట్టం కట్టాలని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ అన్నారు. మండలంలోని ముసిలిపల్లి, పూలికుంట్ల, పి.రాళ్లపల్లి, మోటుపల్లి గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డాక్టర్ దద్దాల నారాయణయాదవ్‌కు ఆయా గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. గ్రామస్తులను డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ ఆప్యాయతతో పలకరించారు. ఇంటింటికీ వెళ్లి నవరత్నాల బుక్‌లెట్‌ను గ్రామస్తులకు అందజేశారు. గడచిన ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి జగనన్న అహర్నిశలు శ్రమించారన్నారు. జెడ్పీటీసీ సభ్యులు గుంటక తిరుపతిరెడ్డి, మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ కాకర్ల వెంకటేశ్వర్లు, జేసీఎస్ మండల కన్వీనర్ పొల్లా సుబ్రహ్మణ్యం, సర్పంచులు టి.సురేష్ బాబు, శ్యామల కృష్ణారెడ్డి, గాలి తిరుపతిరెడ్డి, మోటుపల్లి ఎంపీటీసీ వెంకటగురవయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు టి.దేవసహాయం, యెలికె రమణయ్య, టి.నాని, యెలికె నారాయణ పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపిన జగన్


నాయకులతో తాటిపర్తి చంద్రశేఖర్

పెద్దారవీడు: నవరత్నాలాంటి సంక్షేమ పథకాలతో పేద, మధ్యతరగతి ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరిచి వారి జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి మీ చల్లని దీవెనలు అందించాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తాటిపర్తి చంద్రశేఖర్ కోరారు. మండలంలో శివాపురం, దేవరాజుగట్టు గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అడుగడుగునా పూలు చల్లుతూ నీరాజనాలు పలుకుతూ స్వాగతం పలికారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డికి, తనకు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం నిస్వార్థంగా సేవలందించిన వలంటీర్లను విమర్శించే నైతిక హక్కు టీడీపీ నాయకులకు లేదని, రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. రాష్ట్రంలో ప్రతి పేదవాడు సుభిక్షంగా ఉండాలనే ఆశయంతో ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన అందిస్తున్నారని చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబు అరచేతిలో స్వర్గం చూపించే రకమని, సూపర్ సిక్స్ పథకాలంటూ మీ ముందుకొస్తున్న ఇలాంటి మోసగాడిని ప్రజలు నమ్మొద్దని సూచించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, పార్టీ ఉపాధ్యక్షుడు తౌకల ఆవులయ్య, వజ్రాల ఆదిరెడ్డి, జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య, నాయకులు జైనుల్లాబ్దీన్, వల్లెల ఈశ్వరరెడ్డి, షేక్ బుజ్జి, నందిరెడ్డి రఘునాథరెడ్డి, మెట్టు భాస్కర రెడ్డి, వల్లెల చెన్నారెడ్డి, వెన్నా శివకృష్ణారెడ్డి, దుద్దెల వెంకటరెడ్డి, గాలి రమణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వెంకటరెడ్డి, రాజారావు, బి.నాగరాజు, డి.రామకృష్ణారెడ్డి, రామచంద్రుడు పాల్గొన్నారు.


జగనన్న పాలనలో రాష్ట్రం సస్యశ్యామలం

- ఎన్నికల ప్రచారంలో పార్టీ అభ్యర్థి 'అన్నా'


నాగిరెడ్డిపల్లిలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

కొనకనమిట్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సస్య శ్యామలంగా ఉందని వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. బుధవారం వెలుగొండస్వామి పుణ్యక్షేత్రంలో పూజలు నిర్వహించి కొనకనమిట్ల మండలంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. నాగిరెడ్డిపల్లి, మర్రిపాలెం బీసీ కాలనీ, మర్రిపాలెం, గుర్రాలమడుగు, రేగుమానిపల్లి, వద్దిమడుగు, ఎదురాళ్లపాడు, చౌటపల్లి, తువ్వపాడు పంచాయతీల్లో ప్రజలను కలిసి సంక్షేమ లబ్ధిని వివరించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ తరఫున మార్కాపురం అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తొలుత ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు, మహిళలు అన్నా రాంబాబుకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే అన్నా మాట్లాడుతూ.. మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, విశ్వసనీయతకు మారు పేరుగా నిలిచిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సూరవరపు పెదవెంకటరెడ్డి, మండల సమన్వయకర్త ఉడుముల గురవారెడ్డి, చెన్నారెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి, జిల్లా సేవాదళ్ సమన్వయకర్త మండలపు శ్రీనివాసులరెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం కార్యదర్శి ఏలూరి సంజీవరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మంచికల కోటేశ్వరరావు, జిల్లా నాయకులు చిరుగూరి కోటేశ్వరరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు బోయిన వెంకటేశ్వర్లుయాదవ్, జి.భవాని తిరుపతిరెడ్డి, పిన్నిక పిచ్చయ్యయాదవ్, శిలువకుమారి, పార్లపల్లి సిద్దానబి, పావులూరి లక్ష్మీసాంబ వెంకటేశ్వర్లు, పాతకోట వెంకటరెడ్డి, అంజయ్య, ఎంపీటీసీలు జెనీఫా కరుణయ్య, యద్దనపూడి చిన్నమ్మి, చక్కెర వెలుగొండయ్య, ఆర్యవైశ్య సంఘ నాయకుడు గోనుగుంట్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భైరవకోనలో ఎండోమెంట్ స్పెషల్ సీఎస్ పూజలు


కరికాల వళవన్‌కు శేష వస్త్రాలు, ప్రసాదం అందజేస్తున్న ఈవో, అర్చకులు

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పర్యాటక కేంద్రం, ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భైరవకోనను దేవదాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్.కరికాల వళవన్ బుధవారం సందర్శించారు. భైరవేశ్వరస్వామి, త్రిముఖ దుర్గాదేవి, నగరేశ్వర, భర్గులేశ్వర, కాలభైరవస్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. తొలుత ఆలయ ఈఓ నర్రా నారాయణరెడ్డి, చైర్మన్ సిద్దు రమణారెడ్డి ఘన స్వాగతం పలికారు. అర్చకులు వెంకటనర్సయ్య, సుధాకర్ వేద ఆశీర్వచనం చేసి, శేషవస్త్రాలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

యథేచ్ఛగా 'కోడ్' ఉల్లంఘన


కొమరోలు : అల్లీనగరం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద దర్శనమిస్తున్న శిలాఫలకం


మర్రిపూడి పాత ఆర్బీకే వద్ద పసుపు రంగులో టీడీపీ నేతల పేర్లతో దర్శనమిస్తున్న బెంచ్

కొమరోలు/మర్రిపూడి: ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చి పది రోజులవుతున్నా సంబంధిత అధికారులు నిబంధనలు అమలు చేస్తున్న తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో శిలాఫలకాలు, బెంచ్‌లు యథావిధిగానే దర్శనమివ్వడమే అందుకు కారణం.

- కొమరోలు మండలంలోని అల్లినగరం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శిలాఫలకాన్ని మూసివేయకుండా వదిలివేశారు.
- మర్రిపూడిలోని పాత రైతు భరోసా కేంద్రంలో టీడీపీ సానుభూతిపరుల పేర్లతో, పార్టీ రంగుతో ఉన్న 6 బెంచ్‌లు, తహసీల్దార్ కార్యాలయం ఎదుట మరో బెంచ్ ఇప్పటికీ అలాగే ఉన్నాయి. వీటిని ఎన్నికల సిబ్బంది చూసి కూడా చూడనట్టే వ్యవహరిస్తున్నారని ఆరోపణలొస్తున్నాయి.

కాంట్రాక్టు ఉద్యోగులకు టీడీపీ కండువాలు

- చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

చీమకుర్తి: ఇద్దరు కాంట్రాక్టు ఉద్యోగులు తెలుగుదేశం పార్టీలో చేరారు. సంతనూతలపాడు మండలం పేర్నమిట్టకు చెందిన ఎం.చిరంజీవి కొండపి ప్రభుత్వాస్పత్రిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఎనికపాడుకు చెందిన జి.కోటేశ్వరరావు ఎనికపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. వీరిద్దరూ ఇటీవల సంతనూతలపాడు టీడీపీ అభ్యర్థి బీఎన్ విజయకుమార్ సమక్షంలో కండువాలు కప్పుకున్నారు. ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగాలు చేస్తూ టీడీపీలో చేరిన ఆ ఇద్దరు ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని సంతనూతలపాడు మండలం ఎండ్లూరు వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకుడు అట్లూరి సుధాకర్‌రావు కలెక్టర్, ఎన్నికల అధికారి, సంబంధిత డిపార్టుమెంట్ అధికారులకు బుధవారం ఫిర్యాదు చేశారు.

సింహ వాహనంపై శ్రీనివాసుడు


సింహ వాహనంపై దర్శనమిస్తున్న వెంకటేశ్వరస్వామి

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. బుధవారం స్వామివారు సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వేదపండితులు తిరుమలాచార్యులు, పవన కుమార్‌శర్మ, భార్గవాచార్యులు స్వామివారికి అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. గురువారం శ్రీవారు హంస వాహనంపై దర్శనమిస్తారని ఈఓ, చైర్మన్ తెలిపారు.